www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 25 డిసెంబరు 2023

జిల్లా ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి జిల్లా ప్రజలకు ఆదివారం క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగం, ప్రేమ, కరుణ గొప్పతనాన్ని ఏసుక్రీస్తు తనబోధనల ద్వారా మానవాళికి తెలియజేశారన్నారు. క్రీస్తు అనుసరించిన మార్గం ఎంతో ఆదర్శమన్నారు. శాంతి మార్గంలో పయనించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ అన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని క్రైస్తవ సోదర సోదరీమణులు అందరూ క్రిస్మస్ వేడుకలను ఘనంగా, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని కోరారు.

పూర్తికాని నారుమడులు..!

రబీ సాగు మరింత ఆలస్యం

రెండుజిల్లాల్లో దాదాపు మూడు లక్షల ఎకరాల్లో వరిసాగు

ఇప్పటికీ 50 శాతం మాత్రమే నారుమడులు పూర్తి

ఫ్రిబవరిలోనూ నాట్లు పడే పరిస్థితి

సాగునీటిపై రైతుల్లో ఆందోళన

ఖరీఫ్‌లో తుపాన్ దెబ్బ

రబీసాగుపై గంపెడాశలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మిచౌంగ్ తుపాను ప్రభావం రబీసాగుపై తీవ్రప్రభావం చూపింది. రబీ నాట్లు మరింత ఆలస్యమయ్యే పరిస్థితి నెలకొంది. డిసెంబర్ నెలఖారు వచ్చినా ఇప్పటికీ ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోనూ రబీ నారుమడులు పూర్తికాలేదు. ఇప్పటికీ రెండుజిల్లాల్లో 50 శాతం వరకు మాత్రమే నారుమడులు పూర్తయినట్లు తెలుస్తోంది. కొన్ని మండలాల్లో రైతులు ఇప్పుడే నారుమడులు వేయడం ప్రారంభించారు. ఈనెలఖారుకు కూడా నారుమడులు పూర్తయ్యే అవకాశం కనిపించడం లేదు. రబీసాగు ఆలస్యమయ్యే పరిస్థితి నెలకొనడంతో రబీలో నీటిఎద్దడి కష్టాలు గుర్తుచేసుకుని రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. రబీ సాగుకు సంబంధించి పశ్చిమలో 2.25 లక్షల ఎకరాలు, ఏలూరు జిల్లాలో 56,190 ఎకరాల్లో దాదాపు మూడు లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టనున్నారు. డిశంబర్ 15వ తేదీకి నారుమడులు పూర్తిచేసి జనవరి మొదటివారానికి నాట్లు పూర్తిచేయాలని అధికారులు భావించారు. ఇంతలో మిచౌంగ్ తుపాను విరుచుకుపడటంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. రెండు జిల్లాల్లోనూ ఇంకా ఖరీఫ్ ధాన్యం విక్రయాలు పూర్తికాలేదు. ఇప్పుడే రబీ నారుమడులు రైతులు ముమ్మరంగా వేశారు. నారుమడులు ఆలస్యమయ్యే ప్రాంతాల్లో వెదజల్లుకోవాలని అధికారులు రైతులకు సూచిస్తున్నారు. వెదజల్లితే ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి ఉండటంతో రైతులు నారుమడుల వైపే మొగ్గుచూపుతున్నారు. తుపానుతో ఖరీఫ్‌లో రైతులు తీవ్రంగా నష్టపోయారు. దిగుబడులు బాగా వచ్చినప్పటికీ ఖర్చులు విపరీతంగా అయిపోయాయి. కోతమిషన్‌తో ఎకరం మాసూలు గంటకు పూర్తికావాల్సి ఉండగా రెండు గంటలు పట్టినపరిస్థితి నెలకొంది. దీంతో ఎకరాకు ఒక్క కోతమిషన్‌కే మరో రూ.మూడు వేలు అదనంగా ఖర్చుపెట్టాల్సి వచ్చింది. తడిధాన్యం అరబెట్టేందుకు పెద్దఎత్తున కూలీల అవసరం పడటంతో ఖర్చులు తడిసిమోపుడయ్యాయి. తేమ, రంగుమార్పు పేరుతో మిల్లర్లు కిలోకు రూ.20 చొప్పున ధరలో కోత విధించారు. దీంతో తక్కువగా లెక్కించినా ఎకారకు రూ.ఆరువేల వరకూ నష్టపోయిన పరిస్థితి నెలకొంది. కొన్ని ప్రాంతాల్లో నీటిలో నాని పంట కుళ్లిపోవడంతో మాసూలు చేయకుండా వదిలేసిన పరిస్థితి సైతం నెలకొంది. దిగుబడి వచ్చినా ఖర్చులు పెరిగిపోవడంతో రైతులకు చిల్లిగవ్వ మిగలకపోగా, అప్పులు మూటగట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు రబీసాగుపైనా ఆశలన్నీ పెట్టుకున్నారు. అలాంటిది రబీసాగు సకాలంలో పూర్తయ్యే పరిస్థితి కనిపించడంలేదు. ఈ ప్రభావం దిగుబడిపై పడనుందని రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. దీంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ముఖ్యంగా కౌలురైతుల పరిస్థితి అత్యంత దారుణంగా మారింది.

సాగునీరు సాఫీగా అందేనా..

గడిచిన నవంబర్ 11వ తేదీన ఏలూరు జిల్లాలో ఆ తర్వాత పశ్చిమలోనూ జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశాలు జరిగాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రబీలో సాగుకానున్న 4.60 లక్షల ఎకరాలకు పూర్తిస్థాయిలో నీరందించాలని నిర్ణయించారు. మొత్తం ఆయకట్టుకు 91.35 టిఎంసిల నీరు అవసరమని, కానీ ఈఏడాది అందుబాటులో ఉన్న సాగునీరు 82.49 టిఎంసిలు మాత్రమేనని ఇరిగేషన్ అధికారులు తేల్చారు. వంతులవారీ విధానం, అడ్డుకట్టలు, మోటారు ఇంజన్ల ద్వారా ఎత్తిపోయడం వంటి పద్ధతుల ద్వారా పూర్తి ఆయకట్టుకు సాగునీరందించనున్నట్లు తెలిపారు. ప్రతిఏటా సంక్రాంతికి దాదాపు నాట్లు పూర్తికావడంతో జనవరి 20వ తేదీనుంచి వంతుల వారీవిధానం అమల్లోకి తెచ్చేవారు. ఈసారి అలాంటి పరిస్థితి లేదనే చెప్పాలి. ఫిబ్రవరిలో కూడా నాట్లుసాగే అవకాశం ఉంది. ఏప్రిల్ నెలాఖరు వరకూ సాగునీరు అందించాల్సి ఉంటుంది. ఇప్పటికే సాగునీరు తక్కువగా ఉందని అధికారులు తేల్చారు. ఇలాంటి పరిస్థితిలో సాఫీగాసాగునీరు అందడంపై రైతుల్లో అనుమానాలు నెలకొన్నాయి. సాగునీటిఎద్దడి ఎదురై పంట దెబ్బతింటే పరిస్థితి ఏమిటన్న భయం అన్నదాతను వెంటాడుతోంది. రైతులకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వం ఇప్పటినుంచే రబీ ప్రణాళికలు సిద్ధంచేసుకుంటే తప్ప రైతులకు మేలు జరిగే పరిస్థితి కనిపించడం లేదు.

తణుకురూరల్ : విద్యుద్దీపాలతో ముస్తాబైన చర్చి

సృజనాత్మకతకు బాలోత్సవం దోహదం

మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

మంత్రి కారుమూరి నాగేశ్వరరావును సత్కరిస్తున్న సభ్యులు

ప్రజాశక్తి - తణుకు

బాలల్లోని సృజనాత్మకతను వెలికి తీయడానికి ఇటువంటి పోటీలు దోహదపడతాయని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జరుగుతున్న తణుకు బాలోత్సవ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన విచ్చేసి మాట్లాడారు. తమ ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యతిస్తోందన్నారు. దీనిలో భాగంగానే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆడుదాం కార్యక్రమంలో లక్షల మంది క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభాపాటవాళ్లను తెలియజేస్తున్నారన్నారు. క్రీడలకు తమ ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులు కేటాయిస్తోందన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు ఉంటాయన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు పిల్లలకు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో బోలోత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

భీమవరంలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ఆకివీడులో..

కొవ్వొత్తులతో అంగన్‌వాడీల నిరసన

13వ రోజుకు సమ్మె

ప్రజాశక్తి - గణపవరం

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె 13వ రోజుకు చేరింది. ఆదివారం అంగన్‌వాడీలు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ గణపవరం, సరిపల్లి, ప్రధాన రహదారుల్లో సాగింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ మండల కమిటీ నాయకులు బి.రామకోటి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని సమ్మె చేస్తున్నా పట్టనట్లు వ్యవహరించడం వారిని కించపర్చడమేనని తెలిపారు. ప్రభుత్వం అంగన్‌వాడీలను తక్కువ చేసి చూస్తే రానున్న ఎన్నికల్లో పరాభవం తప్పదని హెచ్చరించారు. వెంటనే ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకులు కెవి.మహాలక్ష్మి జె.జయలక్ష్మి, కళ్యాణి, ధనలక్ష్మి, సిహెచ్. మహాలక్ష్మి పాల్గొన్నారు.

పోడూరు : అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె 13వ రోజుకు చేరింది. ఆదివారం సాయంత్రం మండల వ్యాప్తంగా గ్రామాల్లో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు ప్రాజెక్టు లీడర్ పీతల రాజమణి, జి.వనజ, కె.పద్మావతి, ఎస్.శ్రీపద్మావతి, కె.అరుణ, ఎం.అమ్మాజీ ర్యాలీలో పాల్గొన్నారు.

ఆచంట (పెనుమంట్ర) : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె ఆదివారం 13వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. మండల పరిధిలోని సిఐటియు ఆధ్వర్యంలో నత్తారామేశ్వరం, మల్లిపూడి, సోమరాజు ఇల్లింద్రపర్రు, సత్యవరం, మార్టేరుతో పాటు పలుచోట్ల నిరసన తెలిపారు. కార్యక్రమంలో సాయి మహాలక్ష్మి, మౌనిక, సరస్వతితో పాటు పలు గ్రామాల్లో కార్యకర్తలు పాల్గొన్నారు.

పెనుగొండ : అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ నిరవధిక సమ్మెకు మద్దతుగా మండలంలో లబ్ధిదారులు ప్రదర్శన నిర్వహించారు. అలాగే పలు గ్రామాల్లో తల్లులు, పిల్లలు ఆదివారం సమ్మెకు మద్దతుగా నిలిచారు. అంగన్‌వాడీలు విధులకు హాజరైన తరువాతే తమ పిల్లలను కేంద్రాలకు పంపిస్తామని తల్లులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో కానూరి తులసి, వివి.నాగలక్ష్మి, వి.హైమ, బి.ధనకుమారి, ఎన్.కృష్ణవేణి, పి.వెంకటలక్ష్మి, ఎం.మంగ పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ఉండి : తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె 13వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం అంగన్‌వాడీలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు మాట్లాడుతూ తమను అణగదొక్కడానికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలన్నారు. డిమాండ్లు నెరవేర్చాలని లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆకివీడు : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీల చేపట్టిన సమ్మె 13వ రోజు కొనసాగింది. ఈ దీక్షలో భాగంగా ఆదివారం రాత్రి మండలంలో అంగన్‌వాడీ కేంద్రాల వద్ద కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. మండలంలోని పెదకాపవరంలో అంగన్వాడీ కార్యకర్త దుర్గాదేవి నిర్వహించిన దీక్ష కార్యక్రమంలో అంగన్వాడీల లబ్ధిదారులు సైతం పాల్గొనడం విశేషం. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెను ఆపేదేలేదని అంగన్‌వాడీలు హెచ్చరించారు.

భీమవరం రూరల్ : తమ డిమాండ్లను పరిష్కరించే వరకూ పోరు కొనసాగిస్తామని కార్యకర్తలు ప్రభుత్వానికి హెచ్చరించారు. సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు, కార్యకర్తలు చేపట్టిన సమ్మె ఆదివారానికి 13వ రోజుకు చేరుకుంది. ఈ మేరకు ఆయా గ్రామాల్లోని లబ్ధిదారులతో కలిసి కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. వారికి లబ్ధిదారుల నుండి పూర్తి మద్దతు లభించింది. ఇప్పటికే అంగన్వాడీ కేంద్రాల తాళాలను బలవంతంగా పగలగొట్టడంపై ప్రజలు సైతం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమ సమస్యలను ప్రభుత్వం నెరవేర్చాలని అంగన్వాడీలు కోరుతున్నారు.

ఉండిలో..

గణపవరంలో..

భూహక్కు చట్టం రద్దుకు పోరాటం అవసరం

ఎంఎల్ఎ నిమ్మలకు న్యాయవాదుల వినతి

ప్రజాశక్తి - పాలకొల్లు

భూ హక్కు చట్టం రద్దుకు ప్రజా పోరాటం అవసరమని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు తెలిపారు. ఆయన క్యాంపు కార్యాలయంలో ఆదివారం భూ హక్కు చట్టం రద్దు కోరుతూ నరసాపురం న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో ఎంఎల్ఎకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎంఎల్ఎ మాట్లాడుతూ భూ హక్కుల చట్టం అమలు వల్ల తరతరాల నుంచి ఉన్న ఆస్తులపై ప్రజల హక్కు కోల్పోతారని తెలిపారు. ప్రజల ఆస్తులను ప్రభుత్వం తన చేతిలోకి లాక్కొని అమ్మకానికి, తాకట్టు పెడుతోందని విమర్శించారు. ఈ చట్టంతో ఆస్తుల పట్టాదారు పాస్‌పుస్తకం, టైటిల్ డీడ్, అడంగళ్ ఇలా 20 రకాలు రద్దవుతాయని తెలిపారు. మన ఆస్తిని నిరూపించుకోవాలంటే 2 సంవత్సరాల్లోపు జిల్లా స్థాయిలో ట్రిబునల్ కోర్టు, రాష్ట్రస్థాయిలో ట్రిబ్యునల్ కోర్టు, చివరగా హైకోర్టుకు మాత్రమే వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. ట్రిబ్యునల్ కోర్టుల్లో రెవెన్యూ అధికారులే ఉంటారని, అందువల్ల ప్రభుత్వానికే అనుకూలంగా ఉంటుందన్నారు. మన ఆస్తి ఉందో లేదో ఆన్‌లైన్‌లో ప్రతిరోజూ చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు. తాను ప్రజా సమస్యలపై కలెక్టర్, ఎస్‌పికి ఫోన్ చేస్తే ప్రతిపక్ష ఎంఎల్ఎనని ఫోన్ ఎత్తరని ఇక సామాన్యుడి పరిస్థితి ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవాలని తెలిపారు. భూ హక్కుల చట్టం వల్ల న్యాయవాదులు, ప్రభుత్వానికి సంబంధించిన సమస్య కాదని ప్రజలకు ప్రభుత్వానికి సంబంధించిన సమస్యగా ప్రజలు స్పందించి పోరాటం చేయాలన్నారు. ఈ సమస్యను టిడిపి, జనసేన అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని ఎంఎల్ఎ హామీ ఇచ్చారు.

లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులు అందజేస్తున్న నరసింహరాజు

రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రగా మార్చుకుందాం

డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు

ప్రజాశక్తి - ఆకివీడు

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆశయం మేరకు రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చుకుందామని డిసిసిబి అధ్యక్షులు పివిఎల్.నరసింహరాజు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో నూతనంగా ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం ఆయన నగర పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో లాంచనంగా ప్రారంభించారు. ఛైర్‌పర్సన్ హైమావతి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. జగన్ పేదల ఆరోగ్యం కోసం తపిస్తున్నారన్నారు. ఆ లక్ష్యంతోటే ఆరోగ్యశ్రీ స్థాయిని 25 లక్షలకు పెంచారన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆయన సూచించారు. రానున్న ఎన్నికల్లో అత్యంత జాగురూకతతో వ్యవహరించాలన్నారు. అనంతరం కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రూరల్ బ్యాంక్ ఛైర్మన్ కెసి.రెడ్డి మురళీ, ఎఎంసి ఛైర్మన్ షేక్ హసీనా, వైస్ ఛైర్ పర్సన్ పుప్పాల సత్యనారాయణ, పండు, యువజన నాయకుడు రమేష్, మెప్మా అధ్యక్షురాలు జ్యోతి, సీతారామయ్య పాల్గొన్నారు.

ఉత్తమ నాటికగా 'నాన్నా నేనొచ్చేస్తా'

ప్రజాశక్తి - వీరవాసరం

తోలేరులో సుబ్రహ్మణ్యేశ్వర కళాపరిషత్ నిర్వహించిన జాతీయ స్థాయి నాటిక పోటీలు శనివారం రాత్రితో ముగిశాయి. ప్రథమ ఉత్తమ నాటికగా అమృత లహరి ఆర్ట్స్ గుంటూరు వారి నాన్నా నేనొచ్చేస్తా, ద్వితీయ ఉత్తమ నాటికగా చైతన్య కళాభారతీ కరీంనగర్ వారి చీకటి పువ్వు, తృతీయ ఉత్తమ నాటికగా శార్వాణీ గిరిజన సాంస్కృతిక సేవా కేంద్రం బోరువంక వారి కొత్త పరిమళం ఎంపికైంది. ఉత్తమ రచన చీకటి పువ్వు (పరమాత్ముని శివరాం), ఉత్తమ దర్శకుడు అమృత లహరి (నాన్నా నేనొచ్చేస్తా), ఉత్తమ నటుడు రమేష్ మంచాల (చికటి పువ్వు హరి పాత్రధారి), ఉత్తమ నటి జి.లోహరి (నాన్నా నేనొచ్చేస్తా సుధపాత్రధారి) ఉత్తమ ప్రతినాయకుడు జి.సాంబమూర్తి (కొత్త పరిమళం, జాఫర్ పాత్రధారి), ఉత్తమ సహాయ నటుడు ఎం.పోలినాయుడు, ఉత్తమ సహాయ నటి ఎస్.అమృతవర్షిణి, ఉత్తమ క్యారెక్టర్ నటుడు శ్రీనివాసరావు, ఉత్తమ క్యారెక్టర్ నటి బండారు నాగరాణి, ఉత్తమ రంగాలంకరణ దిలీప్‌రమణ, ఉత్తమ సంగీతం సాయితేజలు ఎంపికయ్యారు. అలాగే తాళిబత్తుల వెంకటేశ్వరరావు, నండింపల్లి వెంకటేశ్వరావులకు జ్యూరీ అవార్డులు అందజేశారు. నాటిక పోటీలు ముగింపు సభ సందర్భంగా ప్రముఖ సినీ నటుడు సుబ్బరాయ శర్మను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు వేంద్ర వెంకటస్వామి, చినమిల్లి వెంకట్రాయుడు, కళాపరిషత్ అధ్యక్షుడు చవాకుల సత్యనారాయణ, పోలిశెట్టి సత్యనారాయణలు పాల్గొన్నారు.

తోలేరులో సుబ్బరాయశర్మను సత్కరిస్తున్న కళాపరిషత్ సభ్యులు

కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా..

మునిస్వామి, నరసింహమూర్తి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఎపి కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా కామన మునిస్వామి, జుత్తిగ నరసింహమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 23వ తేదీన భీమవరంలో ఎస్ఆర్.దాట్ల నగర్‌లో సంఘం 31వ జిల్లా మహాసభ ఉత్సాహభరితంగా జరిగిందని తెలిపారు. 300 మంది హాజరైన ప్రతినిధులు నూతన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతన అధ్యక్ష కార్యదర్శులుగా కామన మునిస్వామి, జుత్తిగ నరసింహమూర్తి ఎన్నికవ్వగా, ఉపాధ్యక్షులుగా మామిడి శక్తి, మామిడిశెట్టి నాగభూషణం, కడలి పాండు, సహాయ కార్యదర్శులుగా బొంతు శ్రీనివాసు, దాసరి సూరిబాబు, బి. చంటి ఎన్నికయ్యారని తెలిపారు. వారితో పాటు మరో 18 మంది కమిటీ సభ్యులుగా మహాసభ ఎన్నుకున్నట్టుగా తెలిపారు.

కామన మునిస్వామి



జుత్తిగ నరసింహమూర్తి

కూరగాయల ధరలకు రెక్కలు

పేద, మధ్య తరగతి ప్రజల గగ్గోలు

పాలకొల్లులో శనివారం వారపు సంత

ప్రజాశక్తి - పాలకొల్లు

ఆనపకాయ రూ.వంద, దోసకాయ రూ.60, వంకాయలు కిలో రూ.100-120, బీరకాయలు రూ.80-100, క్యాలీఫ్లవర్ రూ.50-80 ఈ ధరలు నగరాల్లో మాల్‌లో అనుకుంటున్నారా..కాదు పాలకొల్లు శనివారం వారపు సంతలో ధరలు ఇవి. సాధారణంగా వేసవి కాలంలో ఈ ధరలు ఉంటాయి. అయితే కాయగూరలు పుష్కలంగా పండే శీతాకాలంలో ఈ ధరలు ఉన్న మాట నిజమే. కొన్నిరోజుల క్రితం వచ్చిన తుపాన్ కారణంగా పంటలు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్నాటకలలో దారుణంగా పాడులు పడిపోవడంతో కాయగూరల ఉత్పత్తి తగ్గి ధరలు దారుణంగా పెరిగాయి. దాదాపు అన్ని కాయగూరల ధరలు రెట్టింపు పైగా పెరిగాయి. కొంతలో కొంత వర్షాలు ముందు కిలో రూ.70 ఉన్న ఉల్లిపాయలు రూ.34-50 తగ్గాయి. ప్రస్తుతం మార్కెట్లో టమోటా ఒక్కటే కిలో రూ.30-50 మధ్యన ఉంది. మునగకాడ రూ.15 ఉంది. దేశవాళి చిక్కుడు కాయలు కిలో రూ.80 నుంచి 160కు పెరిగింది. దీంతో సామాన్య మధ్యతరగతి ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. వివాహ శుభకార్యాలు జరిపే వారు, భవాని, అయ్యప్ప మాలధారులు మరింతగా గగ్గోలు పెడుతున్నారు.

మాంసాహారులు గగ్గోలు

ఇదిలా ఉండగా మాంసాహారులు కూడా పెరిగిన చికెన్, గుడ్డు, చేపల ధరలతో గగ్గోలు పెడుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కోడిగుడ్డు ధర రికార్డు స్థాయిలో 5.90 ఉండటంతో రిటైల్‌గా రూ.7 పైన ఉంది. కార్తీక మాసంలో చికెన్ ధర కిలో రూ.160 తగ్గి క్రమేణా పెరుగుతూ ప్రస్తుతం రూ.200 ఉంది. చేపల ధరలు దారుణంగా పెరుగుతున్నాయి. అసలు ప్రజల వద్ద డబ్బులు లేని ఈ సమయంలో క్రిస్మస్, సంక్రాంతి శుభవేళ ధరలు చూసి సామాన్య మధ్యతరగతి ప్రజలు కొనుగోలు చేయలేక గగ్గోలు పెడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఎన్నికల్లో నిమగ్నమై ధరల గురించి పట్టించుకోవడంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న మహిళ, సంఘ పెద్దలు

పోలీసుల తీరుపై స్టేషన్ ఎదుట మహిళ ధర్నా

సిఐ హామీతో విరమణ

ప్రజాశక్తి - ఉండి

ఉండి పోలీస్‌స్టేషన్ ఎదుట చిలుకూరు గ్రామానికి చెందిన ఇజ్జని సువర్ణ, చిలుకూరు సంఘ సభ్యులు ఆదివారం రాత్రి ధర్నా చేశారు. ఈ సందర్భంగా సువర్ణ మాట్లాడుతూ గురువారం తెల్లవారుజామున తాను చర్చికి వెళ్లి ప్రార్థన ముగించుకుని ఇంటికి వచ్చేసరికి దొంగలు ఇంట్లో చోరీ పాల్పడ్డారని తెలిపింది. దీంతో పోలీస్‌స్టేషన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయగా ఇంట్లో ఏమేమి వస్తువులు అపహరణకు గురయ్యాయో నిర్ధారణకు రావాలని, తాము తొమ్మిది గంటలకు వస్తామని పోలీసులు చెప్పారు. తర్వాత వచ్చిన పోలీసులు ఇంటి సమీపంలోని సీసీ టీవీ ఫుటేజ్ పరిశీలించారన్నారు. సీసీ టీవీ ఫుటేజీలో ఇద్దరు వ్యక్తులు కనిపించగా వారిలో ఒక వ్యక్తిపై తాను అనుమానం వ్యక్తం చేశానని సువర్ణ తెలిపింది. అయితే ఉండి పోలీసులు అనుమానితుడికి మద్దతు పలుకుతూ సంఘ పెద్దలకు ఫోన్ చేసి బెదిరింపులకు దిగారన్నారు. దీంతో తాను, సంఘ పెద్దలు ఉండి పోలీస్ స్టేషన్‌కు వచ్చి వివరణ కోరగా వారు సమాధానం దాటవేయడంతో ధర్నాకు దిగాల్సి వచ్చిందని వాపోయింది. ధర్నాపై స్పందించిన సిఐ కెవివిఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ సోమవారం సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

రెండు నెలల నుంచి నియోజకవర్గ కేంద్రమైన ఉండి పోలీస్‌స్టేషన్‌కు ఎస్ఐ లేకపోవడంతో మండలంలో దొంగలు, జూదరులు రెచ్చిపోతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఉండిలో శాంతిభద్రతలను పరిరక్షిస్తూ కోడిపందేలు, పేకాటలను అరికడుతున్న ఉండి పోలీస్‌స్టేషన్ ఎస్ఐ కె.గంగాధరరావును ఎన్నికల ముందు విఆర్‌కు పంపించడం వెనుక ఆంతర్యం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

26న ఉచిత గుండె వైద్య శిబిరం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

బాలలకు సంబంధించిన గుండె వ్యాధులకు ఉచిత వైద్య శిబిరాన్ని ఈ నెల 26వ తేదీ మంగళవారం ఉదయం మెంటేవారితోటలోని అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో నిర్వహించనున్నారు. వసుధ ఫౌండేషన్ వారి సహకారంతో విజయవాడ ఆంధ్రా హాస్పిటల్‌కు చెందిన పిల్లల గుండె వైద్య నిపుణులు కె.విక్రమ్ 15 ఏళ్ల లోపు వయసు ఉన్న పిల్లలను పరిశీలించి 2డి ఎకో పరీక్షలు నిర్వహించి ఉచిత వైద్య చికిత్సలు అందిస్తారు. ఈ వైద్యశిబిరాన్ని భీమవరం పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

వైసిపి యూత్ మండల అధ్యక్షులుగా రుద్రప్రసాద్

ప్రజాశక్తి - ఆచంట

ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆదేశం మేరకు వైసిపి యూత్ అధ్యక్షులుగా కరుగోరుమెల్లి గ్రామానికి చెందిన పిల్లి రుద్రప్రసాద్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. వైసిపి ఆవిర్భావం నుంచి పార్టీలో ఉంటూ అందరి మన్ననలు పొందారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసిపిని అధికారంలో తీసుకొచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న యువతకు మండల కమిటీలో స్థానం కల్పించి ముందుకెళ్తామని తెలిపారు.

హనుమద్వ్రత మహోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - వీరవాసరం

నందమూరుగరువు శ్రీహనుమద్వ్రత మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ పావురాన్ని ఎగరవేసి ఉత్సవాలను ప్రారంభించారు. వచ్చే నెల ఐదో తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల సందర్భంగా పౌరాణిక నాటకాలు, మ్యూజికల్ నైట్, ఏకపాత్రాభినాయలు ప్రదర్శించనున్నారు. ఈ కార్యక్రమంలో భీమవరం ఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆచంటలో ముస్తాబైన చర్చి

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - ఆచంట

మండలంలో సోమవారం క్రిస్మస్ వేడుకలను జరుపుకునేందుకు ప్రార్థన మందిరాలను విద్యుత్ కాంతులతో సుందరంగా తీర్చిదిద్దారు. ఆచంట క్రీస్తు సంఘం ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆ సంఘ కాపరి గాదిరాజ తిమోతిరాజు తెలిపారు. ఈ క్రిస్మస్ వేడుకలకు ఆచంట ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు ముఖ్య అతిథిగా పాల్గొంటారని ఆయన తెలిపారు. చిన్నపేటలో పరిశుద్ధ మార్కు లూథరన్ దేవాలయంలో క్రిస్మస్ వేడుకలు ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్ కట్ చేసి ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్, సర్పంచి కోట సరోజిని వెంకటేశ్వరరావు, వైసిపి నాయకులు పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

మొగల్తూరు : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మొగల్తూరులోని ఆర్‌సిఎం చర్చి, పాలపర్తివారి పేటలోని ప్యారిస్ చర్చి, పేరుపాలెం కాళీపట్నం గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

నేరాలు - ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - పెనుగొండ

ప్రేమించిన యువతి బంధువులు మందలించడంతో మనస్తాపానికి గురైన యువకుడు గోదావరిలోకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని వెంకట్రామపురం గ్రామానికి చెందిన గరగ సత్యనారాయణ కుమారుడు గరగ సాయి సీతారాం (20) ప్రయివేటుగా మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ చదువుతూ నల్లజర్ల రక్త పరీక్ష కేంద్రంలో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 20వ తేదీన సీతారాం బైక్‌పై ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయాడు. తర్వాత ఇంటికి ఫోన్ చేసి తాను ఒక యువతిని ప్రేమించానని, ఆ యువతి బంధువులు మందలించడంతో తాను మనస్తాపానికి గురయ్యానని, ఆ యువతిని మరచిపోలేకపోతున్నానని, అందుకే ఇంట్లో నుంచి వెళ్లిపోయానని తల్లిదండ్రులకు చెప్పాడు. అప్పటినుంచి సీతారం తల్లిదండ్రులు, బంధువులు అతని గాలిస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో శనివారం ఉదయం వశిష్ట గోదావరి సిద్ధాంతంలో గోదావరిలో సీతారాం మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తణుకు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ ఎన్‌వివి.రమేష్ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

'ఎస్ఆర్‌కెఆర్'లో ముగిసిన ఐసిఎఎఐ-2023

అధ్యాపకులకు సర్టిఫికెట్లు అందిస్తున్న సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

అల్గారేథమ్స్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌లో పరిశోధనలు చేసే విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం పెద్దఎత్తున నిధులు అందిస్తుందని, దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎన్ఐటి వరంగల్ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్‌బివి.సుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక ఎస్ఆర్‌కెఆర్ కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ అలగారిద్దమ్స్ ఇన్ అడ్వాన్స్డ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఐసిఎఎఐ-2023) అంశంపై మూడు రోజుల పాటు జరిగిన సదస్సు ఆదివారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ వి.చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అంతర్జాతీయ సదస్సులకు వచ్చిన పేపర్లను విద్యార్థులు ప్రాజెక్టులు స్వీకరించి వాటికి ఆచరణ రూపం తీసుకొస్తే ఎన్నో వినూత్న ఆవిష్కరణలు వెలుగులోకి వస్తాయని తెలిపారు. జెఎన్‌టియుకె కాకినాడ ప్రిన్సిపల్ డాక్టర్ ఎంహెచ్‌ఎం.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ కళాశాలలో జాతీయ, అంతర్జాతీయ సదస్సులు, పెద్ద ఎత్తున నిర్వహించేందుకు అన్ని విభాగాలు కృషి చేయాలని సూచించారు. తద్వారా విద్యార్థులకు ఫ్యాకల్టీకి ఎంతగానో ఉపయోగం ఉంటుందన్నారు. అనంతరం మూడు రోజులపాటు అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్న అధ్యాపకులకు డాక్టర్ సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు, ఎన్ఐటి వరంగల్ ప్రొఫెసర్ నగేష్‌బట్టు, డాక్టర్ కెఎన్‌వి.జగన్మోహన్, డాక్టర్ గుప్తా పాల్గొన్నారు.

అడ్వాన్స్‌డ్ లెర్నింగ్ సిస్టంపై అవగాహన

అడ్వాన్స్‌డ్ లెర్నింగ్ సిస్టం గురించి వివరిస్తున్న నిపుణులు

ప్రజాశక్తి - పాలకొల్లు

2024-2025 విద్యా సంవత్సరం నుంచి పాలకొల్లు మాంటిస్సోరి స్కూల్‌లో లీడ్ ఎడ్యుకేషన్ సొల్యూషన్స్ వారి సహకారంతో ప్రారంభించనున్న అడ్వాన్స్‌డ్ లెర్నింగ్ సిస్టంకు సంబంధించి విద్యార్థులు, తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆదివారం స్కూల్ ప్రాంగణంలో అవగాహన సదస్సు నిర్వహించారు. దేశంలో సుమారు తొమ్మిది వేల స్కూల్స్‌కు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ అందిస్తూ, ఎల్‌సిడిలు, ట్యాబ్స్ సహకారంతో ఇ-లెర్నింగ్ తరగతులు లీడ్ ఎడ్యుకేషనల్ సొల్యూషన్స్ సంస్థ నిర్వహిస్తుంది. ఈ సంస్థ తరపున స్టేట్ హెడ్‌కుమారి స్వప్న, అసోసియేట్ హెడ్ రెహమాత్, రీజనల్ ఇన్‌ఛార్జి చరణ్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆధునిక శిక్షణ విధానాల్లో వస్తున్న అనేక మార్పులను, అందివస్తున్న టెక్నాలజీ సహకారంతో, వీలైనంత సులభంగా అర్థం చేసుకోవడంలో గాని, లోతుగా విషయాన్ని అధ్యయనం చేయడానికి గాని, ప్రపంచవ్యాప్తంగా సమకాలీనంలో జరుగుతున్న విషయాల పట్ల అవగాహన పెంచుకోవడంలో గాని, పరిపూర్ణమైన వ్యక్తులుగా ఎదగడానికి ఈ విద్యా విధానం ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా అకాడమిక్ డైరెక్టర్ కెవి.కృష్ణవర్మ మాట్లాడుతూ పాలకొల్లులో ఉన్న స్కూలులో మొదటిసారిగా పాలకొల్లు మాంటిస్సోరిలో ఈ ఆధునిక టెక్నాలజీని ప్రవేశ పెడుతున్నామని, విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి ఏ విధమైన అదనపు ఫీజులు వసూలు చేయకుండా విద్యార్థుల ఉన్నతే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని వచ్చే విద్యా సంవత్సరం నుంచి కర్కులంలో భాగంగా చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎస్‌పిఎస్.ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

26న ఆడుదాం ఆంధ్రా మారథాన్

జయప్రదానికి జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డి పిలుపు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నుంచి అంబేద్కర్ చౌక్ వరకు డిసెంబర్ 26న ఆడుదాం ఆంధ్రా మారథాన్ నిర్వహించనున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వినూత్న రీతిలో రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పేరిట ఆటల పోటీలను ఈ నెల 26 నుంచి 47 రోజుల పాటు జరిపేందుకు వేడుకలను పెద్దఎత్తున ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్రీడలు మంచి ఆరోగ్యానికి, శరీర దృఢత్వానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ, పట్టణ ప్రాంతాల్లోనూ ఈ క్రీడల ద్వారా పేద ప్రజల్లో ఉన్న క్రీడా స్ఫూర్తిని రగిలించి ఉత్తమ క్రీడాకారులను తయారు చేయడం లక్ష్యంగా కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. ఈ క్రీడలను నిర్వహించేందుకు పంచాయతీరాజ్ శాఖ, మున్సిపాలిటీలు, విద్యాశాఖ, స్పోర్ట్స్ అథారిటీస్ నాలుగు శాఖలను కలిపి సమన్వయ పరిచినట్లు తెలిపారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ నెల 26వ తేదీన మారథాన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మారథాన్ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పాల్గొననున్నట్లు తెలిపారు. మారథాన్ అనంతరం లూథరన్ గ్రౌండ్స్‌లో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను లాంఛనంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, క్రీడాకారులు, క్రీడాభిమానులు, ఉత్సాహవంతులు, జిల్లా అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆడుదాం ఆంధ్రా అవగాహన మారథాన్ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కృష్ణ, మహేష్ యువసేన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు పట్టణ కృష్ణ, మహేష్ యువసేన 2024 - 2026 సంవత్సరానికి నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా మేడికొండ శ్రీనివాస్ చౌదరి ఎంపికయ్యారు. గౌరవ ముఖ్య సలహాదారులుగా కోరాడ శ్రీనివాస్, గుమ్మపు సూర్యవరప్రసాద్, ధనాని సూర్యప్రకాష్, కొరగింజల హనుమంతరావు, గాదిరెడ్డి బాలసుబ్రహ్మణ్యం ఎంపికయ్యారు. కో ఆర్డినేటర్స్‌గా పినిశెట్టి బుజ్జి, పినిశెట్టి శ్రీను, వాడరేవు శ్రీను, రెడ్డిప్రసాద్ ఎంపికయ్యారు. అధ్యక్షులుగా తలువురి భుజంగరావు, కాసా ధనరాజు, గాది దుర్గాప్రసాద్, కార్యదర్శులుగా గిరిజాల సత్యశ్రీను, వేండ్ర శ్రీనివాస్, ఉద్దగిరి మణికంఠ ఎంపికయ్యారు. జాయింట్ సెక్రటరీలుగా కూసిమే కిషోర్, ఆర్.రాజ్‌కుమార్, గొల్లముందల చందు ఎంపికయ్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్లుగా యరకం ప్రతాప్‌రెడ్డి, కోశాధికారిగా గరికిన దేవసాయిప్రసాద్, సహాయ కోశాధికారిగా మల్లిపూడి బోస్ ఎంపికయ్యారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి పథకం గురించి గ్రామీణస్థాయిలో ప్రతిఒక్కరికీ అవగాహన కల్పించాలని సెంట్రల్ టీం పరిశీలకులు ఫిషరీష్ సైంటిస్ట్ జివిఎ.ప్రసాద్ అన్నారు. మండలంలోని లంకలకోడేరు పిహెచ్‌సి బల్లిపాడు సచివాలయం పాలమూరులో సర్పంచి పివిఎల్.స్వామినాయుడు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన పథకం గురించి వివరించారు. ఈ పథకం ద్వారా రూ.ఐదు లక్షల ఖరీదు చేసే వైద్యం పొందవచ్చున్నారు. రాష్ట్రంలోనే కాకుండా ఏ రాష్ట్రంలోనైనా వైద్య సహాయం పొందవచ్చని తెలిపారు. ఆరోగ్య విస్తనాధికారి గుడాల హరిబాబు ఆరోగ్య పథకాలపై వివరించారు. గ్రామ సర్పంచి స్వామినాయుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలన్నీ మారుమూల గ్రామాల్లో ఉన్న ప్రతి పేదవారికి అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచితాడిపర్తి వరప్రసాద్‌బాబు, బిజెపి నాయకులు పంచదార వెంకట రంగారావు, డాక్టర్ నవ్యజీవన్, వెటర్నరీ డాక్టర్ వరప్రసాద్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పిహెచ్‌ఎన్.ఎలిజిబెత్, గ్రామ కార్యదర్శి ముల్కి నాగ దిలీప్, సూపర్‌వైజర్లు జి.ఉదయ్‌చందర్, ఎస్‌కె.అమలేశ్వరరావు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మంగ, ఎంఎల్‌హెచ్‌పిలు శిరీష, గౌతమి, ఎఎన్‌ఎంలు కనకదుర్గ, ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యాత్రికులతో ముత్యాలమ్మ ఆలయం రద్దీ

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మ ఆలయం ఆదివారం యాత్రికలతో కళకళలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు పర్యవేక్షణలో సిబ్బంది ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో భజన కాలక్షేపం, ప్రసాద వితరణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

ఇరుకు వంతెనతో ఇక్కట్లు

ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు

గంటలపాటు నిలిచిపోతున్న ట్రాఫిక్

నెరవేరని నేతల హామీలు

శిథిలావస్థకు చేరిన కోపల్లె వంతెన

పెరిగిపోయిన పిచ్చిమొక్కలు

ప్రజాశక్తి - కాళ్ల

పాలకులు మారుతున్నా.. ప్రభుత్వాలు మారుతున్నా దశాబ్దాలుగా ఉన్న కోపల్లె - జక్కరం వంతెనకు మాత్రం మోక్షం కలగడం లేదు. ఇరుకు వంతెనపై ప్రయాణికులు, వాహనదారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల్లో గెలుపొందడానికి పలు హామీలు గుప్పించడం, ఆ తర్వాత మరిచిపోవడం రాజకీయ పార్టీలకు సర్వసాధారణమైంది. 2019 ఎన్నికల్లో ప్రజలకు అత్యంత అవసరమైన పలు హామీలను వైసిపి గుప్పించింది. అధికారంలోకొచ్చి నాలుగున్నరేళ్లు పూర్తయినప్పటికీ ఏ ఒక్క హామీ కూడా అమలు చేయలేదు.

ఉండి నియోజకవర్గంలో టిడిపి ఎంఎల్ఎగా మంతెన రామరాజు గెలుపొందారు. వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు అధికారపార్టీ తరుపున అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఏ ఒక్కరూ కూడా ఎన్నికల్లో ఇచ్చిన కోపల్లె-జక్కరం వంతెన ప్రధాన హామీని కూడా నెరవ్చేలేకపోయారు. మండలంలో కోపల్లె -జక్కరం వంతెన ప్రధాన వంతెన ప్రమాదాలకు నిలయాలుగా మారింది. శిథిలావస్థకు చేరడం, రక్షణ గోడలు సరిగా లేకపోవడం, ఇరుకుగా ఉండటంతో ఆందోళన కలుగుతుంది. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాలు గాలిలో కలిసి పోవాల్సిందే. వంతెన నిర్మించాక రెయిలింగ్ దెబ్బ తిన్నా అధికారులు మరమ్మతులు చేయడం లేదు. భారీ వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. కోపల్లె వంతెనల రక్షణ గోడలు ధ్వంసమై ప్రమాదభరితంగా మారాయి.

బ్రిటిష్ హయాంలో నిర్మించిన ఈ వంతెనపై భారీ వాహనాల రాకపోకలతో శిథిలావస్థకు చేరింది. చిన్నవాహనం ఎదురొచ్చినా తప్పుకోలేని పరిస్థితి నెలకొంది. ఇది రాష్ట్రీయ జువ్వలపాలెం రహదారిలో నిత్యం ఎదుర్కొనే అవస్థలు. జువ్వలపాలెం రోడ్డు నుంచి గుడివాడ, విజయవాడ, అమరావతి వెళ్లాలంటే ఈ రోడ్డే ప్రధాన మార్గం. ఈ రహదారిపై ఈ వంతెన ఇరుకుగా ఉంది. ఈ వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మిస్తామని గత 26 ఏళ్లుగా నేతలు హామీలు ఇస్తూ వస్తున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా, ప్రజా ప్రతినిధులు మారుతున్నా వంతెన నిర్మాణం మాత్రం జరగడం లేదు.

నెరవేరని ఎన్నికల హామీ

జక్కరం-కోపల్లె వంతెన ఎన్నికల హామీని నెరవేర్చడంలో అధికార, ప్రతిపక్ష నాయకులు శ్రద్ధ చూపడం లేదు. మండలంలోని జక్కరం గ్రామానికి చెందిన పాతపాటి సర్రాజు, కలవపూడి గ్రామానికి చెందిన వేటుకూరి వెంకటశివరామరాజు, మంతెన రామరాజు ఉండి ఎంఎల్ఎలుగా ఎన్నికయ్యారు .2004 నుంచి 2019 సార్వత్రిక, స్థానిక సంస్థల ప్రతి ఎన్నికల్లో వంతెన నిర్మాణం చేపడతామని పాలకులు హామీలు ఇచ్చారు. నిధులు వచ్చాయి. పనులు జరుగుతాయని నాయకులు ప్రసంగాలు చేయడమే తప్ప నిర్మించేందుకు చర్యలు తీసుకోలేదు.

విజయవాడ వెళ్లేందుకు దగ్గర మార్గం

నిత్యం భీ మవరం నుంచి విజయవాడ ఇతర పట్టణాలకు వెళ్లాలంటే ఆర్‌అండ్‌బి రోడ్డు దగ్గర మార్గం. రైల్వే గేట్లు తక్కువగా ఉండటంతో ఈ రోడ్డు నుంచి వాహన రాకపోకలు సాగు తున్నాయి. వంతెన రైయిలింగ్ కూలిపోయింది. వంతెన పిల్లర్లపై మొక్కలు పెరిగిపోయాయి.

నిలిచిపోయిన ట్రాఫిక్

ట్రాఫిక్ కష్టాలు

జువ్వలపాలెం రాష్ట్రీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులకు, ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఆక్వా రంగం గణనీయంగా విస్తరించిన కాళ్ల మండలంలో ఎక్కువగా ఆక్వా ఉత్పత్తులను నిత్యం తరలిస్తుంటారు. బొండాడ మురుగు కాలువపై వంతెన నిర్మాణం చేపట్టకపోవడంతో ప్రజలు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. అనేక సార్లు వంతెన నిర్మాణం చేపట్టాలని వైసిపి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ధర్నాలు చేసిన సంఘటనలు ఉన్నాయి.

నిధులు మంజూరైన నిర్మాణం జరగలేదు

వైసిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత ఈ వంతెన నిర్మాణానికి కోర్ నెట్‌వర్క్ నిధులు రూ.12 కోట్లు మంజూరయ్యాయి. టెండర్లు పిలిచారు ఎవరూ ముందుకు రాలేదు. ట్రాఫిక్ కష్టాలు లేకుండా చేసేందుకు కొత్త వంతెన నిర్మాణం పనులు చేపట్టాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

కనీసం వంతెన మరమత్తులు చేపట్టాలి

పి.సత్యనారాయణరాజు, జక్కరం



వందేళ్ల క్రితం నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది. ఇరుకు వంతెనతో ప్రతి రోజు ట్రాఫిక్ నిలిచిపోతోంది. వంతెన మరమతులు చేపట్టాలి. జక్కరం-కోపల్లె గ్రామాల మధ్య కొత్త వంతెన నిర్మాణం చేపట్టాలి.

ఎసిఎఫ్ రాష్ట్ర సీనియర్ జనరల్ సెక్రటరీగా పూర్ణచంద్రరావు

మండవల్లి : యాంటీ కరప్షన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా స్టేట్ సీనియర్ జనరల్ సెక్రటరీగా భైరవపట్నంకు చెందిన అల్లాడ పూర్ణచంద్రరావు ఎంపికయ్యారు. విజయవాడలోని యాంటీ కరప్షన్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ప్రెసిడెంట్స్ డాక్టర్ జాకీర్ షరీఫ్, షేక్ రజాక్‌లు ఆంధ్రప్రదేశ్ స్టేట్ సీనియర్ జనరల్‌గా అల్లాడ పూర్ణచంద్రాలను నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఎసిఎఫ్ఐ గురించి ప్రజలకు తీసుకువెళ్లి, గ్రామ స్థాయిలో సదస్సు ఏర్పాటు చేసి దీని ఆవశ్యకత గురించి ప్రతి ఒక్కరికి తెలియజేసేలా కార్యక్రమాలు నిర్వహిస్తానని అన్నారు. అంతేకాకుండా రాష్ట్రంలో, దేశంలో అవినీతిపై పోరాడే వారి కొరత తీవ్రంగా ఉందని అవినీతిని అంతమొందించడం కోసం పట్టుదలతో పనిచేసేవారు పెద్ద సంఖ్యలో ముందుకు రావాలని కోరారు. నాపై నమ్మకం ఉంచి జనరల్ సెక్రెటరీగా నియమించినందుకు ఆయన అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ
జంగారెడ్డిగూడెం డివిజన్, ఏలూరు జిల్లా
ఇ-ప్రొక్యూర్మెంట్ టెండర్ నోటీసు
జంగారెడ్డిగూడెం డివిజన్, ఏలూరు జిల్లాలోని వై.యస్.ఆర్. జగనన్న లేఔట్ కాలనీలు (మొత్తము 58) నందు స్వాగత ద్వారముల నిర్మాణము కొరకు ప్రథమ పిలుపుగా అర్హులైన కాంట్రాక్టర్ల నుండి ఇ-ప్రొక్యూర్మెంట్ ప్లాట్ ఫార్మ్ ద్వారా టెండర్లు కోరబడుచున్నవి. సమాచారము తేదీ. 25-12-2023 సా॥ 5.00 గం॥ల నుండి www.e-procurement.gov.in నందు సందర్శించగలరు.
1) పోలవరం నియోజకవర్గము 2) చింతలపూడి నియోజకవర్గము
3) గోపాలపురం నియోజకవర్గము
సం/- కార్యనిర్వాహక ఇంజనీరు (గృహ), జంగారెడ్డిగూడెం డివిజన్